పోటీ పరీక్షల్లో నెగ్గాలంటే..?

డిగ్రీ పాసయ్యాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. గ్రూప్-4కు ఎలా సన్నద్ధం కావాలి? – బి. వందన



■ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నిర్వహించే గ్రూప్స్ ఉద్యోగాలకు భారీ సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తు చేస్తుంటారు. ఇంత పోటీని తట్టుకొని ఉద్యోగం సంపాదించాలంటే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం అవ్వాల్సిందే. జనరల్ నాలెడ్జ్, సెక్రటేరియల్ ఎబిలిటీస్‌లో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలుంటాయి. ప్రాంతీయ భౌగోళిక, సామాజిక, సంస్కృతి, వారసత్వం, ఆర్థికం, కళలు, సాహిత్యం, పాలన విధానాలపై అవగాహన ఏర్పర్చుకోండి. దీంతోపాటు భారత రాజ్యాంగం, భారత భౌగోళిక అంశాలు, భారత ఆర్థిక వ్యవస్థ, భారత జాతీయోద్యమం అంశాలపై కూడా పట్టు సాధించండి. దైనందిన జీవితంలో సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ సమస్యలు, విపత్తు నిర్వహణ, అంతర్జాతీయ సంబంధాలు, సమకాలీన సంఘటనలపై కూడా ప్రశ్నలుంటాయి. విజయం సాధించాలంటే రోజుకు కనీసం 8 గంటలు చదవాల్సిన అవసరం ఉంది. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి గత సంవత్సర కాలంలో జరిగిన సంఘటనలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. అంకగణిత/ సంఖ్యా సామర్థ్యాలకు సంబంధించిన సూత్రాలను ఒకచోట రాసుకొని, రోజూ ప్రాక్టీస్ చేయండి.

ఏ పోటీ పరీక్షలోనైనా సరైన సమాధానాన్ని ఒక నిమిషంలోపే గుర్తించగలిగే సామర్థ్యం ముఖ్యం. సోషల్ మీడియాలో వ్యాపించే నెగెటివ్ ప్రచారాలకు దూరంగా ఉండండి. ప్రామాణిక పుస్తకాల నుంచి సమాచారాన్ని సేకరించి మీరే సొంతంగా నోట్స్ తయారుచేసుకోండి. మార్కెట్‌లో/ సోషల్ మీడియాలో దొరికే స్టడీ మెటీరియల్ నాణ్యతను పరిశీలించాకే, దానిపై ఆధారపడండి. ప్రశాంతమైన మనసుతో, ఎలాంటి ఆందోళనకూ గురి అవ్వకుండా పరీక్షకు సన్నద్ధమై మీ లక్ష్యాన్ని చేరుకోండి.

- ప్రా. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

నకిలీలు ఉన్నాయ్... జాగ్రత్త!

ఇటీవల సీబీఎస్ఈ బోర్డు వెబ్‌సైట్‌లో 'విద్యార్థులు ఎక్జామ్డ్జిమెంట్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటే కొంత రుసుము చెల్లించాలి' అంటూ పేమెంట్ గేట్‌వే తెరుచుకునేది. 'అసలు ఎటువంటి డబ్బూ చెల్లించాల్సిన పని లేదు కదా, ఇలా కట్టమంటోంది ఏంటా' అని ఆరాతీస్తే... అది అసలు సీబీఎస్ఈ వెబ్‌సైట్ కానే కాదు! అచ్చం దాన్ని పోలినట్లు తయారుచేసిన నకిలీ సైట్. దీని ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి డబ్బు కొట్టేయడం మాత్రమే కాదు... వ్యక్తిగత సమాచారం చోరీ చేసేందుకు దుండగులు ఈ ఎత్తు వేశారు.

అలాగే... ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ ఎగ్జామినేషన్ (ఎఫ్ఎంజీఈ) పరీక్షకు సిద్ధమవుతున్న వైద్య విద్యార్థులను... ఆ పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు ఏంటో ముందే చెబుతాం అంటూ కొందరు కేటుగాళ్లు సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా సంప్రదిస్తున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామ్స్ (ఎన్‌బీఈ) గుర్తించింది. దుండగులు చాలా తెలివిగా, తమ వద్దనున్న ప్రశ్నపత్రాలు ఎన్‌బీఈవేనని అనిపించేలా సంస్థ లోగో, ప్రశ్నపత్రం సరళిని ఉపయోగించినట్లు తెలుసుకుంది. ఇది పూర్తిగా మోసపూరిత చర్యేనని, విద్యార్థులు ఈ ట్రాప్‌లో పడొద్దని హెచ్చరికలు జారీ చేసింది ఎన్‌బీఈ.

ఈ తరహా వెబ్‌సైట్లను చోరులు ఎంత నాణ్యంగా తయారుచేస్తున్నారంటే... అవి నకిలీవనే ఆలోచన కూడా మనకు రాదు. నిజానికి వీటి ద్వారా ఏదో కొద్దిపాటి సొమ్ము చేజిక్కించుకోవడం దుండగుల లక్ష్యం కాదు. ఒక్కసారి మీరు ఆ సైట్లలోకి వెళ్లడం, ఏదైనా క్లిక్ చేయడం, సమాచారం నమోదు చేయడం వంటివి చేస్తే... ఆ కాస్త డేటాతో వారు మీ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా గురించి, గోప్యమైన ఇతర సమాచారం దొంగిలించడానికి ప్రయత్నిస్తారు.

« నకిలీలు.. గతంలో వస్తు విపణికి మాత్రమే పరిమితమైన ఈ తరహా మోసాలు ఇప్పుడు విద్యా రంగాన్నీ తాకుతున్నాయి. ఏటికేడు పెరుగుతున్న ఈ రంగం మార్కెట్‌ను గమనించి... దుండగులు ఈ మోసాలకు తెరతీస్తున్నారు. నకిలీ అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ డిగ్రీలు, ప్రశ్నపత్రాలు... ఇలా ఒక్కటేమిటి, విద్యార్థులకు అవసరమయ్యి, ఆకర్షించే ప్రతి విషయాన్నీ వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వీటిపట్ల అప్రమత్తంగా లేకపోతే డబ్బు నష్టపోవడమే కాకుండా, లేనిపోని సమస్యల బారిన పడే ప్రమాదం ఉంది.

వెబ్‌సైట్లు చూసేటప్పుడు...

« విద్యార్థులు తరచూ వాడే సైట్ల అడ్రస్‌ను పోలిన వెబ్ అడ్రస్‌లతో నకిలీ సైట్లు ఉంటాయి. ఒక పదం లేదా అక్షరం మార్చడం వంటివి చేస్తుంటారు. అయితే... సైటును పూర్తిగా చూస్తే ఆ తేడాను గమనించవచ్చు. అందుకే దేన్నయినా వినియోగించేటప్పుడు మనకు కావాల్సిన విభాగం దగ్గరకు నేరుగా వెళ్లిపోకుండా ఒకసారి మొత్తం జాగ్రత్తగా చూడాలి.

« అనుమానం వస్తే ఆ డొమైన్ ఎన్నాళ్ల నుంచి మనుగడలో ఉందో చూడాలి. ఈ సమాచారం విడిగా అంతర్జాలంలో వెతికితే సులువుగా లభిస్తుంది.

« వైరస్ స్కాన్ రన్ చేయడం ద్వారా కూడా ఉపయోగం ఉంటుంది.

« మనకొచ్చే సంక్షిప్త సందేశాలు, ఈ-మెయిల్స్‌లో ఉన్న లింక్స్‌ను క్లిక్ చేయడం కంటే కూడా నేరుగా కావాల్సిన వెబ్‌సైట్‌ను ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయడం మంచిది. ఫేక్ సైట్లలోకి మనల్ని లాగేందుకు దుండగులు ఇలాంటి ఈ-మెయిల్స్, నోటిఫికేషన్స్ ద్వారా గాలం వేస్తుంటారు. వీటిని 'ఫిషింగ్ మెయిల్స్' అంటారు. అందువల్ల ఇటువంటి వాటిని అనుసరించకపోవడం ఉత్తమం.

« మన సిస్టంలో వెబ్‌సైట్ చెకర్, సేఫ్ బ్రౌజింగ్ టూల్స్ పెట్టుకోవడం ద్వారా కొంతవరకూ వీటి నుంచి దూరంగా ఉండొచ్చు.

« కొన్ని సైట్లు చూడటానికి నాసిరకంగా అనిపిస్తూ ఉంటాయి. పదాల్లో తప్పులు దొర్లడం, సైట్ డిజైన్‌లో లోపాలు వంటివి కనిపిస్తుంటే... అటువంటి వాటికి స్పందించే ముందు పూర్తిగా సరిచూసుకోవడం మంచిది.

« గూగుల్ సేఫ్ బ్రౌజింగ్ టూల్‌లో ఏదైనా వెబ్‌సైట్ అడ్రస్ టైప్ చేస్తే అది సురక్షితమా కాదా అన్నది చెప్పేస్తుంది.

« ఈ ఫేక్ వెబ్‌సైట్లకు చాలాసార్లు 'అబౌట్ అజ్' అనే విభాగం కానీ, సంప్రదించాల్సిన సమాచారం కానీ ఉండవు. సంస్థ అడ్రస్, ఫోన్ నంబర్ ఇవ్వకపోయినా, ఇచ్చినా అవి తప్పు అని తెలిసినా అప్రమత్తంగా ఉండాలి.

ఆన్‌లైన్ డిగ్రీలు...

ఇప్పుడు ఆన్‌లైన్ కోర్సులు చేయడం సర్వసాధారణం. అయితే ఏదైనా కోర్సు ఎంచుకునేటప్పుడు కూడా అది సరైనదా కాదా అని చెక్ చేసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే ఈ సంస్థల్లో కూడా నకిలీల బెడద ఎక్కువయ్యింది. ఇవి సరైనవా కాదా అన్నది తెలుసుకునేందుకు కొన్ని సూచనలు ...

1. ● ఆన్‌లైన్ డిగ్రీల అక్రెడిటేషన్‌ను సరిచూసుకోవాలి. చదవాలి అనుకుంటున్న కోర్సు గురించి పూర్తిగా తెలుసుకోవాలి.
2. ● కొన్ని సంస్థలు ప్రఖ్యాత యూనివర్సిటీల పేరును కాపీ కొడుతుంటాయి. పేరుమోసిన సంస్థలకు ముందో వెనుకో ఒక పదం తగిలించి అనుబంధ విభాగాలు అని నమ్మించేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఇటువంటి వాటి వలలో పడొద్దు.
3. ● చేరే ముందే మొత్తం ఫీజు చెల్లించేయమంటుంటే అనుమానించాల్సిందే.
   ● రివ్యూలు ఏమైనా ఉన్నాయో లేదో, ఆ రివ్యూ ఇస్తున్న వ్యక్తి సరైనవారా కాదా అన్నది చెక్ చేసే అవకాశం ఉందేమో చూడాలి.
4. ● డిగ్రీ చేయడం మరీ వేగంగా, సులభంగా అయిపోతున్నట్లు అనిపిస్తే కాస్త ఆగి ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.
5. ● అసలైన సంస్థలు విద్యార్థులకు సపోర్ట్ సర్వీస్, లైబ్రరీ వంటి సౌకర్యాలు కల్పిస్తుంటాయి అటువంటి సమాచారం ఏదీ లభించకపోతే ఇంకొంచెం తెలుసుకుని నిర్ణయం తీసుకునేందుకు ప్రయత్నించాలి.
6. ● ఆ సంస్థ పూర్తి సమాచారం, అడ్రస్, ఫోన్ నంబర్ వంటివి ఏవీ లేకపోతే అనుమానించాలి. అది ఎంత ఆన్‌లైన్ సేవలు అందించేదే అయినా... ఎక్కడో ఒక చోట కార్యాలయం అనేది ఉండకమానదు. ఆ వివరాలు తెలుసుకోవాలి.

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

లీడ్ జనరేషన్

సంస్థ: కొరిజో
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/bf83c9

వెబినార్ ఈవెంట్ ప్లానింగ్

సంస్థ: కొరిజో
స్టైపెండ్: నెలకు రూ.1,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: సేల్స్ అండ్ మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/011f83

ఆపరేషన్స్

సంస్థ: యువర్ రిటైల్ కోచ్ (వైఆర్‌సీ)
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/226953

ఆపరేషన్స్

సంస్థ: సైటీవ్యూస్ డిజిటల్ మీడియా
స్టైపెండ్: నెలకు రూ.3,000-8,000
దరఖాస్తు గడువు: 13.01.2023
అర్హతలు: ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్ నైపుణ్యాలు
☛ internshala.com/i/d73407

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్

సంస్థ: టెక్‌పూప్
స్టైపెండ్: నెలకు రూ.3,000
దరఖాస్తు గడువు: 21.01.2023
అర్హతలు: నోడ్.జేఎస్, పైతాన్ నైపుణ్యాలు
☛ internshala.com/i/d594b5

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: ద క్రాఫ్టీ టాక్
స్టైపెండ్: నెలకు రూ.21,000
దరఖాస్తు గడువు: 21.01.2023
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, వీడియో ఎడిటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/1259ef

యూఐ అండ్ యూఎక్స్ డిజైన్

సంస్థ: ద క్రాఫ్టీ టాక్
స్టైపెండ్: నెలకు రూ.18,000
దరఖాస్తు గడువు: 21.01.2023
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఇలస్ట్రేటర్, ఇన్‌డిజైన్, ఫొటోషాప్, ఎక్స్‌డి, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్, యూజర్ ఇంటర్‌ఫేస్ డెవలప్‌మెంట్, వైర్‌ఫ్రేమింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/9119dc

లీడ్ జనరేషన్

సంస్థ: మీడియస్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.5,000
దరఖాస్తు గడువు: 20.01.2023
అర్హతలు: ఈమెయిల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ రాయడం, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
☛ internshala.com/i/c03645

షార్ట్‌నోట్స్‌తో సక్సెస్!

ఈఎస్ఈ టాపర్ తేజస్విని

ఉద్యోగ బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే ఉన్నత స్థాయి పోటీ పరీక్ష రాయడానికి ఆమె సంసిద్ధమైంది. అందరిలా శిక్షణపైనే ఆధారపడకుండా సొంతంగా 'షార్ట్‌నోట్స్' తయారు చేసుకుని, సాధన చేసింది. ఇటీవల వెలువడిన ప్రతిష్ఠాత్మకమైన ఇంజినీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ (ఈఎస్ఈ) ఈ అండ్ టీ స్ట్రీమ్‌లో జాతీయస్థాయి మూడో ర్యాంకు సాధించారు దేవనబోయిన తేజస్విని. ప్రస్తుతం హైదరాబాద్‌లోని క్వాల్ కాం సంస్థలో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పనిచేస్తున్న ఈమె తన సన్నద్ధత విశేషాలను ఇలా వివరించారు...

ఈ ఎస్ఈలో ఏదో ఒక ర్యాంకు మాత్రమే వస్తుందనుకున్నా కానీ ఆలిండియా థర్డ్ ర్యాంకు వస్తుందని ఊహించలేదు. ఫలితాలు చూశాక నా శ్రమ ఫలించిందనిపించింది. వాస్తవానికి 2019, 2020లలో వరుసగా ఈఎస్ఈ నెగ్గాలని ప్రయత్నించి విఫలమయ్యాను. మొదటి సారి ప్రిలిమినరీ, రెండోసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనుదిరగాల్సి వచ్చింది. అపజయాల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని ఈసారి సఫలమయ్యాను.

హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ప్రగతినగర్ మా నివాసం. నాన్న వెంకట్రావు విశ్రాంత ఉద్యోగి. అమ్మ కృష్ణకుమారి ఏపీలో ప్రభుత్వ ఉద్యోగిని. నారాయణ ఒలింపియాడ్ స్కూల్లో టెన్త్, నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివాను. మొదట ఇంజినీరింగ్ సర్వీస్ గురించి నాకేమాత్రమూ అవగాహన లేదు. కానీ ఓ సారి మా అమ్మ చెప్పడంతో ఆసక్తి పెరిగింది. 2016లో హైదరాబాద్ ఐఐఐటీలో బీటెక్ (ఈసీఈ) చేశాను. తర్వాత ఈఎస్ఈపై లోతుగా శోధించి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. అమ్మానాన్నలతో పాటు అక్క గీతిక కూడా నన్ను ప్రోత్సహించి అండగా నిలిచింది.

'గేట్' రాసి 122వ ర్యాంకు సాధించాను. ఈ సన్నద్ధత ఈఎస్ఈకి ఎంతగానో ఉపయోగపడింది. గేట్‌లో క్లిష్టమైన ప్రశ్నలు ఇస్తారు గానీ ఈఎస్ఈలో అంతకంటే సంక్లిష్టమైన ప్రశ్నలుండటం వల్ల ఆ అనుభవం దీనికి దోహదపడింది.

మాక్ టెస్టులు

హైదరాబాద్ ఆబిడ్స్‌లోని ఏస్ అకాడమీలో, దిల్లీలోని మేడ్‌ఈజీ కేంద్రాల్లో ఐదేసి నెలల చొప్పున శిక్షణ తీసుకున్నాను. ఈ పరీక్షలో శిక్షణ తీసుకోకుండా రాణించడం కష్టం. టెక్నికల్‌లో 15, నాన్ టెక్నికల్‌లో 10 మాక్ టెస్టులు రాశాను. అందులోని ప్రధాన అంశాలను తరచూ పునశ్చరణ చేసుకున్నాను. ప్రాక్టీస్ కోసం ఎక్కువగా మాక్‌టెస్ట్‌లపైనే ఆధారపడ్డాను. అందులోంచి తప్పుల జాబితాను రూపొందించి అవి పునరావృతం కాకుండా ప్రత్యేక కసరత్తు చేశాను. తద్వారా కచ్చితత్వం, వేగం పెంచుకోగలిగాను.

పాఠ్యాంశాలపై పట్టు

కోచింగ్ సెంటర్‌లో బోధించిన 'క్లాస్ నోట్స్' నుంచి కీలకమైన అంశాల కూర్పుతో సొంతంగా 'షార్ట్‌నోట్స్' తయారు చేసుకున్నాను. దాన్ని వీలైనన్ని ఎక్కువసార్లు పునశ్చరణ చేసుకోవడం నాకున్న అలవాటు. దాంతో 'ఫొటోగ్రాఫిక్ మెమరీ' విధానం అబ్బింది. ఈ పరీక్షల్లో విజయం సాధించడానికి ఆ విధానం నాకు దోహదపడింది. ప్రాక్టీస్ కోసం అనేక మాక్ టెస్ట్‌లు రాయడంతో ప్రతి సబ్జెక్టుపైనా గట్టి పట్టును సాధించాను. రోజుకు 4 నుంచి 6 గంటల వరకు ప్రిపేర్ అయ్యాను. సెలవు రోజుల్లో అయితే ఆ సమయం మరింత పెరిగేది. ఉద్యోగ బాధ్యతల్లో తలమునకలై ఉన్నప్పటికీ నాకున్న సమయాన్ని ఈఎస్ఈ సన్నద్ధతకు సద్వినియోగం చేసుకోగలిగాను.

కోచింగ్ కేంద్రాల వారిచ్చిన శిక్షణతో పాటు ఆన్‌లైన్‌లో 'మాక్‌టెస్ట్'లతో ఎక్కువ ప్రాక్టీస్ చేశాను. ఇతర పుస్తకాలపై ఆధారపడకుండా రివిజన్‌కే ఎక్కువ సమయాన్ని కేటాయించాను. కొన్ని సందర్భాల్లో మాత్రమే.. అదీ సందేహాల నివృత్తి కోసం వెబ్‌సైట్లను ఆశ్రయించాను.

- ముత్యాల నర్సింహులు,
న్యూస్‌టుడే, మూసాపేట

ఈఎస్ఈ మీ లక్ష్యమైతే..

- ప్రతి అభ్యర్థికీ ప్రధానంగా 'ఎగ్జామ్ మేనేజ్‌మెంట్' అవసరం. ప్రిలిమినరీ, మెయిన్స్ అంశాలపై ప్రధాన దృష్టిని సారించాలి. వాస్తవానికి ఈ రెండు దశలే అభ్యర్థికి 80 శాతం విజయావకాశాలు అందిస్తాయి.
- ఎవరికి వారు తమ స్థాయికి సరిపోయేలా సొంత వ్యూహాన్ని అనుసరించాలి.
- అభ్యర్థులు సమయ నిర్వహణపై దృష్టి పెట్టడం ప్రధానం.
- సాధారణంగా పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఒకే సబ్జెక్టులో పలు పుస్తకాలు చదువుతుంటారు. దీంతో సమయం వృథా. ప్రాక్టీస్‌కు వీలుండదు. సమయాభావంతో కొందరు కొన్ని సబ్జెక్టును చదవకుండా పూర్తిగా వదిలేస్తారు. దీంతో నష్టం ఎక్కువ. అలా కాకుండా అన్ని అంశాలూ చదివి, ప్రాక్టీస్ చేయటం వల్ల పరీక్షల్లో సులభమైన ఎక్కువ ప్రశ్నలకు జవాబులు రాసే అవకాశం ఉంటుంది.

అంచనాలు... అందుకోవాలా?

అంచనాలు... విద్యార్థుల జీవితంలో ఇవి భాగం. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, బంధుమిత్రుల అంచనాలు అందుకోవడం కోసం మనం చాలా కష్టపడుతుంటాం. ఇవి మన స్థాయికి మించినవి అయితే మాత్రం కొన్ని ఇబ్బందులు తప్పవు. అలాంటప్పుడు వీటిని అందుకోవాలా? అక్కర్లేదా? అసలు ఈ అంచనాలను ఎలా ఎదుర్కోవాలి?

« అన్నింటికంటే ముందు... మనం ఇప్పుడున్న స్థితి బాగానే ఉందనే ఆత్మస్థైర్యంతో ఉండాలి. నిరంతరం అసంతృప్తిలో కూరుకుపోవడం మంచిది కాదు. అది మన ఎదుగుదలపై చెడు ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

« సాధారణ విద్యార్థుల విషయమే మాట్లాడుకుంటే... చుట్టూ ఉన్నవారి అంచనాలకు, వారి శక్తిసామర్థ్యాలకు మధ్య ఎంతోకొంత వ్యత్యాసం అనేది ఉండకమానదు. టాపర్స్ తప్పిస్తే ఇది అందరి విషయంలోనూ జరిగేదే. అందువల్ల కంగారు, ఒత్తిడి అనవసరం. వాటి మధ్య బ్యాలెన్స్ తీసుకురావడానికి వీలైనంతగా ప్రయత్నించాలి అంతే.

« తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అంతిమంగా కోరుకునేది మన మంచినే. వారికంటే ఉన్నతంగా మనం ఉండాలనే భావిస్తారు. వారి ఆలోచనాధోరణి నుంచే అంచనాలు సృష్టించుకుంటారు. అయితే అది మన ఆశలు, ఆశయాలకు భిన్నంగా ఉన్నప్పుడు ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటాం అనేది ముఖ్యం.

« కూర్చుని మాట్లాడుకుంటే యుద్ధాలు సైతం ఆగుతాయి అంటారు. అటువంటిది మన కుటుంబంలో పరిస్థితులు ఎంత? వారి అంచనాలకు భిన్నంగా మనం ఉన్నప్పుడు కాస్త ఇబ్బందికర వాతావరణం తలెత్తడం సహజం. కానీ మనం ఏం కావాలి అనుకుంటున్నాం, ఎలా చేయాలి అనుకుంటున్నాం అనేది చెప్పే విధంగా సావధానంగా చెబితే వినేందుకు ఎదుటివారు సిద్ధపడతారు. ఇందుకోసం మన కమ్యూనికేషన్ స్కిల్స్‌పై దృష్టిపెట్టడం అవసరం.

« అదే విధంగా మనపై మనకున్న అంచనాలు ఏంటనేది కూడా తెలుసుకోవాలి. అవి వాస్తవానికి వీలైనంత దగ్గరగా ఉండాలి. ఇది గుర్తించేందుకు కొంత ప్రయత్నం, శ్రమ అవసరం. మనకు అంతిమంగా సంతోషాన్ని కలిగించేవి ఇవే. అందుకే వాటికి కొంత సమయం కేటాయించడం అవసరం.

« కొన్నిసార్లు మనం ఏం చేసినా ఎదుటివారు సంతోషించకపోవచ్చు. అటువంటప్పుడు ఆ విషయాన్ని వదిలేసి... మిగతా చోట్ల మనం వారితో ఏ విధంగా సంతోషంగా ఉండగలమో ఆలోచించాలి. ఏదో ఒక విషయంలో మనతో ఏకీభవిస్తారు కదా!

చివరిగా.. కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న అంచనాలే మన లక్ష్యాలుగా మారొచ్చు. వాటిని అందుకోవడం మనకు ఆనందాన్ని కలిగించవచ్చు! అందువల్ల వాటిని పూర్తిగా ప్రతికూల దృక్పథంతో చూడాల్సిన పనిలేదు. హ్యాండిల్ చేయడం సాధన చేస్తే చాలు!

నోటిఫికేషన్స్

ప్రభుత్వ ఉద్యోగాలు

గెయిల్-న్యూదిల్లీలో ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూదిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్) చీఫ్ మేనేజర్, సీనియర్ ఇంజినీర్, సీనియర్ ఆఫీసర్, ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, సెక్యూరిటీ, ఫైర్ అండ్ సేఫ్టీ, మెకానికల్, రెన్యూవబుల్ ఎనర్జీ తదితరాలు.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 65 శాతం మార్కులతో ఇంజినీరింగ్ డిగ్రీ/ గ్రాడ్యుయేషన్/ బీఈ/ బీటెక్/ ఎంబీఏ/ సీఏ/ సీఎంఏ/ మాస్టర్స్ డిగ్రీ/ పీజీ డిప్లొమా.
వయసు: 28-45 ఏళ్లు ఉండాలి.
అనుభవం: కనీసం 1-12 ఏళ్లు.
ఎంపిక: షార్ట్‌లిస్టింగ్, స్క్రీనింగ్, గ్రూప్ డిస్కషన్/ ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు ఫీజు: రూ.200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 02.02.2023
వెబ్‌సైట్: www.gailonline.com/ CRApplyingGail. html

సీఎంటీఐ-బెంగళూరులో...

బెంగళూరులోని సెంట్రల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్ (సీఎంటీఐ) 18 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్/ మాస్టర్స్ డిగ్రీ(ఇంజినీరింగ్)/ ఎంసీఏ/ పీహెచ్‌డీ.
వయసు: 32-40 ఏళ్లు.
ఎంపిక: స్క్రీనింగ్, మెరిట్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు: ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా.
చిరునామా: చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, తుంకూర్ రోడ్, బెంగళూరు 560022.
దరఖాస్తుకు చివరి తేదీ: 05.02.2023
వెబ్‌సైట్: https://cmti.res.in/vacancies/

ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో...

ఛత్తీస్‌గఢ్ రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్.. ఒప్పంద ప్రాతిపదికన కింది విభాగాల్లో 39 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: అనస్థీషియాలజీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, క్లినికల్ హెమటాలజీ, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, గ్యాస్ట్రోఎంటరాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ అంకాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ తదితరాలు.
అర్హత: సంబంధిత స్పెషాలిటీలో మెడికల్ పీజీ, ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్+ బోధన/ పరిశోధన అనుభవం.
వయసు: 50 సంవత్సరాలు మించకూడదు.
దరఖాస్తు రుసుము: రూ.1,000 (ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళా అభ్యర్థులకు రుసుం చెల్లింపు నుంచి మినహాయింపు).
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 27.01.2023.
వెబ్‌సైట్: https://www.aiimsraipur.edu.in/

51 యంగ్ ప్రొఫెషనల్ ఖాళీలు

భారత ప్రభుత్వరంగ సంస్థ అయిన నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) ఒప్పంద ప్రాతిపదికన 51 యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: ఎంబీఏ(మార్కెటింగ్) ఉత్తీర్ణత.
వయసు: 32 ఏళ్లు మించకూడదు.
కాంట్రాక్ట్ వ్యవధి: 3 ఏళ్లు.
ఎంపిక: షార్ట్‌లిస్టింగ్/ఇంటర్వ్యూ/ గ్రూప్ డిస్కషన్ ద్వారా.
దరఖాస్తు: అభ్యర్థులు సంబంధిత ప్రాంతీయ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తు గడువు: ఉద్యోగ ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://www.ncdc.in/index.jsp?page=career=en

ఐఐఎస్‌టీ-కేరళలో రిసెర్చ్‌స్టాఫ్

కేరళలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్‌టీ) 14 రిసెర్చ్ ఫెలో/ ప్రాజెక్ట్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ ఎమ్మెస్సీ.
వయసు: 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 25.01.2023
వెబ్‌సైట్: https://www.iist.ac.in/career/3